క్లుప్తంగా

ఘనంగా వారకల్యాణం

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శనివారం అర్చకులు రవీంద ర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు వేద మంత్రాల నడుమ స్వామివారి వార కల్యాణం నిర్వహించారు. ఈఓ లక్ష్మిప్రసన్న ఆధ్వర్యంలో వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన నీలం రాంబాబు-సూర్యవతిలు భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. సిబ్బంది రమేష్, వీరన్న, లక్ష్మి, మల్లికార్జున్, వసంత, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్ పాల్గొన్నారు.

రక్తదానం



జనగామ రూరల్: తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని ఏఆర్ కానిస్టేబుల్ షాడ పోచయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 37వ సారి రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో కురుమ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించే బీరప్ప పండుగకు నాయకులు సహకరించాలని ఆ గ్రామ కుల సంఘం బాధ్యులు కోరారు. ఈ మేరకు శనివారం రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ పండుగకు సహకరిస్తామని, ఉత్సవాలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ కర్నాల వేణుగోపాల్, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కాపర్తి హరిప్రసాద్‌గుప్తా, నాయకులు యాదండ్ల భాస్కర్‌గౌడ్, పాల్గొన్నారు.

సత్కారం



రఘునాథపల్లి: సివిల్స్‌లో సత్తా చాటిన మండలకేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్‌కుమార్‌ను శనివారం జనగామ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు సత్కరించారు. ప్రణయ్‌కుమార్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు కొయ్యడ ప్రభాకర్-లక్ష్మి దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా సుగుణాకర్ రాజు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్లాలన్నారు.

అవగాహన

జనగామ రూరల్: అవగాహనతో అగ్నిప్రమాదాలను నివారించొచ్చని అగ్నిమాపక శాఖ ఎస్సై మధుకర్ అన్నారు. శనివారం పట్టణంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వేసవి దృష్ట్యా తరుచు అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటాయని వాటి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

రఘునాథపల్లి: ప్రభుత్వం ప్రకటించిన 5వ తరగతి గురుకుల పాఠశాలల ప్రవేశాల ఫలితాల్లో మండలంలోని మంగళిబండతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో గుగులోతు శాన్వి, నునావత శ్రావణి, బానోత్ లోహిత, గుగులోత్ నందిని, అంగోత్ సంజయ్ ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ంతో పాటు ఉపాధ్యాయులు రవీందర్, ఖాజాపరుద్దీన్, గ్రామస్తులు ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

ఆటోను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్

- యువకుడి మృతి..
- కరుణాపురం వద్ద ఘటన



మురళి(ఫైల్)

చిల్పూరు: ఆటోను ఓ ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. ఈ ఘటనలో ఓ యువకుడు (డ్రైవర్) మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని వంగాలపల్లి-కరుణాపురం గ్రామాల బస్ స్టేజీ జాతీయ రహదారిపై జరిగింది. ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం అల్లీపూర్‌కు చెందిన కొండోజు మురళి (27) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కిరాయి నిమిత్తం ఆటోలో స్టేషన్ ఘన్‌పూర్‌కు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. కరుణాపురం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చి ఇండియన్ ఆయిల్ ట్యాంకర్.. ఆటోను ఢీకొంది. దీంతో మురళి కింద పడ్డాడు. వెనుక టైర్లు మురళిపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్కెట్‌లో కొనుగోళ్లు బంద్

- కార్యదర్శి శ్రీనివాస్



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న హమాలీలు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ప్రైవేట్ ఖరీదు దారులు వ్యవసాయ ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా లేకపోవడంతో యార్డులోకి రైతులు సరుకులు తీసుకు రావొద్దని మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు మార్కెట్‌కు ఎటువంటి వ్యవసాయ ఉత్పత్తులను అనుమతించడం లేదన్నారు. రైతులు ఎవరూ కూడా మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవద్దని ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి కలెక్టర్ రిజ్వాన్‌బాషా యార్డులో కొనుగోళ్లపై ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. . గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్లకు ధాన్యం తీసుకువెళ్లి మద్దతు ధరకు అమ్ముకోవాలన్నారు. జిల్లా యంత్రాంగం తదుపరి ఉత్తర్వులను జారీ చేసే వరకు మార్కెట్ యార్డుకు సరుకులు తీసుకురావద్దన్నారు. కాగా మక్కలు, చింతపండుకు సంబంధించి అమ్మకాలు ఎలా అనే దానిపై అధికారులు స్పష్టం చేయలేదు.

చిల్లర కాంటా దోపిడీని అరికట్టరా?

మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారంపై నిషేధించిన అధికారులు, చిల్లర కాంటాల వద్ద అడ్డగోలు దోపిడీపై ఎందుకు దృష్టి సారించడం లేదని ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగబండి రవీందర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ హమాలీ, ట్రేడర్ల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో కొనుగోళ్లపై ప్రభావం చూపిందన్నారు. ప్రతి రెండేళ్ల కోసారి 40 శాతం హమాలీ పెంచాల్సి ఉండగా, ఈ సారి 5శాతం పెంచుతున్నట్లు ట్రేడర్లు చెప్పగా, హమాలీలు అందుకు నిరాకరించారన్నారు. మార్కెట్‌లో బంద్ ఉండడంతో చిల్లర కాంటాల వద్ద దోపిడీకి గురవుతున్న రైతులను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

జనగామ మార్కెట్‌పై ఇంత కక్ష ఎందుకు?

రాష్ట్రంలో అనేక మార్కెట్ పరిధిలో ప్రైవేట్ కొనుగోళ్లు జరుగుతుంటే, ఒక్క జనగామ యార్డుపై ఇంతటి కక్షసాధింపులు ఏంటని అడ్తీ అసోసియేషన్ అధ్యక్షుడు మాశెట్టి వెంకన్న అన్నారు. ఆయన మాట్లాడుతూ తిర్మలగిరి, సూర్యాపేట తదితర మార్కెట్‌లో ప్రైవేట్‌గా ఈ ధర నడుస్తుందని, తేమ ఆధారంగానే తాము కూడా కొనుగోలు చేసినట్లు స్పష్టం చేశారు. మార్కెట్‌ను క్లోజ్ చేయడంతో దీనిపై ఆధారపడ్డ వందలాది కుటుంబాలకు భరోసా లేకుండా పోతుందని, అధికారులు పునరాలోచించాలని కోరారు.

అధికారులకు హమాలీల వినతి

మార్కెట్ యార్డులో కొనుగోళ్లు యథావిధిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జనగామ అగ్రికల్చరల్ గ్రేయిన్ మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఎంసీ అధికారులకు ప్రతినిధులు గుండెల్లి రాజు, అయిలయ్య తదితరులు వినతి పత్రం అందజేశారు. గతవారం రోజులుగా మార్కెట్ బంద్ చేయడం తో హమాలీలు, స్వీపర్లు, సుమారు 250 మంది జీవనోపాధి కోల్పోతున్నారన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఫిక్స్‌డ్ బాండ్లను అందజేస్తున్న మరియా జోసఫ్

జనగామ: తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తూ.. విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం పాటుపడే ఉపాధ్యాయుడు చొప్పరి గణేష్ గుండె పోటుతో మృతి చెందగా.. బాధిత కుటుంబానికి మేమున్నామంటూ జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు ఏరియా సెయింట్ పాల్స్ స్కూల్ కుటుంబం కొండంత భరోసా ఇచ్చింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఫాదర్ ఎస్.మరియ జోసఫ్ మాట్లాడుతూ గడిచిన 8 ఏళ్లుగా గణేష్ తెలుగు ఉపాధ్యాయుడిగా తమ స్కూల్‌లోనే పని చేశాడని తెలిపారు. ఇటీవల ఆయన గుండె పోటుతో మృతి చెందగా, ఆయన భార్య గాయత్రి, ముగ్గురు చిన్న పిల్లలు అనాథలయ్యారన్నారు. గణేష్ అకాల మరణంతో ఆకుటుంబానికి ఇబ్బంది కలుగకూడదనే ఉద్దేశ్యంతో ప్రతి ఒక్కరు స్పందించారని చెప్పారు. పాఠశాల నుంచి ముగ్గురు పిల్లలకు ఉచిత విద్యతో పాటు రూ.2లక్షల నగదు, గాయత్రికి ఉద్యోగం, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు, మిత్రబృందం మరో రూ.3 లక్షలు సేకరించి మేమున్నామంటూ వారికి కొండంత భరోసా ఇచ్చారన్నారు. మొత్తం రూ.5లక్షల నగదును ముగ్గురు పిల్లల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, సంబంధిత పత్రాలను మృతుడి భార్యకు అందించామన్నారు. ఆపత్కాలంలో మానవత్వం చాటుకున్న యాజమాన్యం, వరంగల్ పీఠాధిపతులు బిషప్ ఉడుముల బాలకు ప్రధానోపాధ్యాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే గణేష్ కుటుంబాన్ని ప్రభుత్వం సైతం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

‘మోదీని మూడోసారి ప్రధాని చేయండి’



నర్మెట: ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు



జనగామ రూరల్: పట్టణంలో..

నర్మెట: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించి మూడోసారీ మోదీని ప్రధానమంత్రిని చేయాలని బీజేపీ దళిత మోర్చా మండల శాఖ అధ్యక్షుడు బుచ్చాల కొమురెల్లి కోరారు. మండలంలోని అమ్మాపురంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ఎన్నిక ప్రచారం నిర్వహించిన ఆయన ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బూత్ అధ్యక్షు గంగం గాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు జంపాల సిద్దులు చంద్రారెడ్డి, కృష్ణమూర్తి, సుధాకర్, శివారెడ్డి పాల్గొన్నారు.

పట్టణంలో బీజేపీ ఇంటింటా ప్రచారం

జనగామ రూరల్: బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ ను ఎంపీగా గెలిపించాలని కోరుతూ శనివారం పట్టణంలో 17,18,24, 27 వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ హరిశ్చంద్ర గుప్త మాట్లాడారు.సౌడ రమేష్, శివరాజ్, పట్టణ అధ్యక్షుడు పవర్‌శర్మ, ఉప్పలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి’



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న బెలిదె వెంకన్న



రఘునాథపల్లి: మాట్లాడుతున్న జగదీష్‌చందర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు బెలిదె వెంకన్న అన్నారు. మండలంలోని శివునిపల్లిలో పార్టీ బూత్‌స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నీల రాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, నాయకులు బూర్ల శంకర్, గుర్రం రాజు, తోట సత్యం, చిగురు విజయ్‌కుమార్, గుర్రం ఫాతికుమార్, చింత జ్యోత్స్న, సింగపురం వెంకటయ్య, లింగం, భిక్షపతి పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి’

రఘునాథపల్లి: వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య భారీ మెజార్టీతో గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కుర్చపల్లి, గోవర్దనగిరి, కోమల్ల, మల్లంపల్లి, శివాజీనగర్, కంచనపల్లి, రామన్నగూడెం, కోడూర్, గబ్బెటలో ఆయన పార్టీ నాయకులతో కలిసి వెళ్లి అయా గ్రామాల కార్యకర్తలతో సమావేశమై బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జగదీష్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చిన కడియం కావ్య గెలుపే లక్ష్యంగా అవిశ్రాంతిగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ బొల్లం అజయ్, జిల్లా నాయకులు మారుజోడు రాంబాబు, మేకల నరేందర్, మాసంపల్లి లింగాజీ, గాదె రమేష్, మల్కపురం లక్ష్మయ్య, జయరాములు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జఫర్‌గఢ్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారులు కృషి చేయాలని ఎంపీపీ రడపాక సుదర్శన్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పని తీరుపై చర్చించారు. జెడ్పీటీసీ ఇల్లెందుల బేబి ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి



బండనాగారం నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బచ్చన్నపేట: ఉపాధి హామీ కూలీలు కొలతల ప్రకారం పనులు చేస్తేనే కూలి గిట్టుబాటు అవుతుందని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధి గోపాల్‌నగర్, బండనాగారం గ్రామాల్లో ఈజీఎస్ పనులు, వన నర్సరీలు, పల్లెప్రకృతి వనాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయమే పనులకు వెళ్లి ఎండ పెరగక ముందే ఇంటికి రావాలని సూచించారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన వసతులు కల్పించాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని చెప్పారు. నర్సరీల్లో మొక్కలను రక్షించడానికి ఉదయం, సాయంత్రం నీరు పట్టాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు, పల్లె ప్రకృతి వనంలో పచ్చగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ పార్థసారథి, డీఆర్‌డీఓ మొగులప్ప, డీపీఓ వినోద్‌కుమార్, ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఏపీఓ కృష్ణ, ఈసీ జగదీష్, టీఏలు, పంచాయితీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలతోపాటు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

నర్మెట: విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. మండల పరిధి గండిరామారం, బొమ్మకూర్ సంపద(పల్లెప్రకృతి) వనాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని చెప్పారు. ఆర్డీఓ మొగులప్ప, ఎంపీడీఓ ఖాజామొహిఉద్దీన్, తదితరులున్నారు.

బూత్ కమిటీలే పార్టీకి బలం

చిల్పూరు: బూత్ కమిటీలే పార్టీకి బలమని నాయకులు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీలను నాయకులు నియమించారు. గడ్డమీది సురేష్, తీగల మహేందర్, మామిడాల లింగారెడ్డి, ఏదునూరి రవీందర్, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, టీపీసీసీ కార్యదర్శి సింగపురం ఇందిర ఆదేశాల మేరకు బూత్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా నాయకులు అన్నం బ్రహ్మారెడ్డి, అన్నెబోయిన భిక్షపతి, మంచాల ఎల్లయ్య, కట్ట మనోజ్‌రెడ్డి మాట్లాడారు. మోహన్ రావు, వెంకటస్వామి, బాలకృష్ణమూర్తి ఉన్నారు.

‘మాదిగల ద్రోహి కడియం’



స్టేషన్‌ఘన్‌పూర్: గత నలభై ఏళ్లుగా తన రాజకీయ జీవితంలో ఏ మాదిగను ఎదగకుండా కుట్రలు చేస్తూ స్వార్థంతో వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్న కడియం శ్రీహరి మాదిగల ద్రోహి అని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్‌మాదిగ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి సండెన రవీదంర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్‌తో మాదిగల అండతో రాజకీయంగా ఎదిగిన కడియం శ్రీహరి మాదిగలకే ద్రోహం చేస్తున్నాడన్నారు. ఎంఎస్‌పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, ఎంఎస్‌పీ నాయకులు కొయ్యడ మల్లేష్ పాల్గొన్నారు.

పిల్లల అభ్యున్నతికి అంగన్‌వాడీలు దోహదం

దేవరుప్పుల: పిల్లల అభ్యున్నతికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడుతున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని కోలుకొండలో ఇసీసీఈ డే పురస్కరించుకొని ఐదేళ్లు నిండిన పిల్లలకు ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: సముద్రాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం అంగన్‌వాడీ స్కూల్‌డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్య హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె.చంద్రకళ, ఎస్.సునీత, జి.విజయ, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

‘మాదిగలను విస్మరించిన ప్రభుత్వం’



పరామర్శిస్తున్న ప్రవీణ్

బచ్చన్నపేట: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలను ప్రభుత్వం ఎంపీ ఎన్నికల్లో విస్మరించినదని వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డు ప్రవీణ్ అన్నారు. మాదిగలకు ఒక్క ఎంపీ సీటు ఇవ్వలేదని దీక్ష చేపట్టి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు శనివారం ఆయన పరామర్శించి మాట్లాడారు. మాదిగలకు ఒక్క ఎంపీ సీటు అయినా సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మాదిగలు ఎంతో కృషి చేశారని, ఇప్పటికైనా గుర్తించాలన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

అవకతవకలపై విచారణ చేయించాలి



వినతి అందజేస్తున్న నాగరాజు, సభ్యులు

జనగామ: జిల్లా కేంద్రం క్లాం రోడ్డులోని చేనేత కార్మికుల సభ్యుల ద్వారా కొనుగోలు చేసిన భూమికి సంబంధించి అవకతవకలపై విచారణ చేయించాలని కోరుతూ భారత్ టీసీహెచ్‌డబ్ల్యూసీఎస్ జిల్లా అధ్యక్షుడు గుర్రం నాగరాజు, సభ్యుల ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రం అందజేశారు. సొసైటీ కార్యవర్గ సభ్యులు 1989లో 12 ఎకరాలను ఖరీదు చేయడం జరిగిందన్నారు. సొసైటీ సభ్యుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసేందుకు ఖర్చులు అధికం కావడంతో నాటి తహసీల్దార్ ప్రభుత్వానికి అప్పగించినట్లు స్పష్టం చేశారు. ప్రతి సభ్యుడి నుంచి రూ.1,200 చొప్పున తీసుకుని, 252 మందికి పట్టా సర్టిఫికెట్లు, మరో 22 మందికి తహసీల్దార్ చేత సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. పట్టాలు పొంది 35 ఏళ్లు గడిచి పోతున్నా, ఆర్థిక పరిస్థితులతో ఇళ్ల నిర్మాణాలు చేసుకోలేదన్నారు. ప్రస్తుతం జాగాకు సంబంధించి ఈసీని పరిశీలించగా, 9.14 గుంటలు ఉన్నట్లు కనిపిస్తుందని దీనిపై విచారణ జరిపించాలన్నారు. సర్టిఫికెట్లు పొందిన ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు కలెక్టర్ చొరవ చూపించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

సెల్‌ఫోన్ అప్పగింత

దేవరుప్పుల: గత నెల 3వ తేదీన ధర్మాపురం పరిధి పడమటితండాకు చెందిన జాటోత్ శ్రీనివాస్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శనివారం ఎస్సై ఎస్.చెన్నకేశవులు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోయిన సెల్‌ఫోన్ ఇప్పించినందుకు బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కానిస్టేబుల్ యాకూబ్ ఉన్నారు.

బియ్యం అందజేత

పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన పెనుగొండ కిష్టమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. శనివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు 25 కిలోల బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులను అందజేశారు. సహకరించిన బత్తిని దేవేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి హరీష్ పాల్గొన్నారు.

ట్రాక్టర్స్ యూనియన్ అధ్యక్షుడిగా రంజాన్



రఘునాథపల్లి: మండలంలోని గబ్బెట గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు శనివారం సమావేశమై నూతన ట్రాక్టర్స్ యూనియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ రంజాన్, ఉపాధ్యక్షుడుగా పుట్టల బాబు, కార్యదర్శిగా పులి రామాంజనేయులు, సహాయ కార్యదర్శిగా ఎలిశాల అంజయ్య, గౌరవ సభ్యులుగా చిట్యాల యాకయ్య, కొడిశాల సుధాకర్, జిట్టబోయిన రాజు, సోమయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రంజాన్ మాట్లాడుతూ ట్రాక్టర్ యజమానుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నూతన అధ్యక్షుడు రంజాన్‌ను స్థానికులు అభినందించారు.

నామినేషన్‌కు వేలాదిగా తరలిరండి



పాలకుర్తి: ఈనెల 22న వరంగల్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్ కుమార్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి వేలాదిగా తరలి రావాలని నియోజకవర్గం ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్ కోరారు. పాలకుర్తిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, సహకార సొసైటీ చైర్మన్ బొబ్బాల అశోక్ రెడ్డి, ఎంపీటీసీ పురుషోత్తం పాల్గొన్నారు.

పరామర్శ

చిల్పూరు: లింగంపల్లికి చెందిన పురుమాని బుచ్చయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు, మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 2వేల సాయం అందజేశారు.

చర్య తీసుకోవాలి

పాలకుర్తి టౌన్: ఈ నెల 17న వావిలాల గ్రామంలో శ్రీరామనవమి పూజలు చేస్తామని వచ్చిన రజకులను కించపరిచిన వారిపై చర్య తీసుకోవాలని రజక వృత్తిదారుల సంఘం నాయకుడు ఏదునూరి మదార్ అన్నారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ విగ్రహం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాముడు అందరి దేవుడని పూజలు చేస్తామని వచ్చిన వారిపై వివక్ష చూపారని తెలిపారు. తప్పు చేసిన వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్, రాజు. పాపయ్య, రాజు, శ్రీదర్, సోమయ్యలు పాల్గొన్నారు.

కడియంను కలిసిన నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: కులాంతర వివాహితుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెసరు సారయ్య, కన్వీనర్ చిలగాని రాకేష్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని, కాంగ్రెస్‌పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను శనివారం హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు.

జయప్రదం చేయండి

జనగామ రూరల్: అంబేడ్కర్, పూలే జనజాతర సదస్సును జయప్రదం చేయాలని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సామాజిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కరపత్రాలు అవిష్కరించి మాట్లాడారు. ఈనెల 27న పట్టణంలో గాయత్రి గార్డెన్‌లో జనజాతర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. శేఖర్, సాంబరాజు యాదగిరి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

బచ్చన్నపేట : మండల కేంద్రంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న బెల్టు షాపులపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ దాడులను నిర్వహించి మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కంకల సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో అందె సుధాకర్ బెల్టు షాపును నిర్వహిస్తూ మద్యాన్ని విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు రూ.22,310 విలువైన మద్యాన్ని పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు జమాలొద్దీన్, అనిల్, నర్సిరెడ్డి, రాకేష్ పాల్గొన్నారు.

అడ్డొచ్చిన వారిపై కత్తితో దాడి

నర్మెట: మద్యానికి బానిసైన వ్యక్తి భార్యతో గొడవ పడుతుండగా అడ్డుపడిన వారిపై దాడిచేసి గాయపరిచిన సంఘటన మండలంలోని మాన్సింగ్ తండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మాన్సింగ్ తండాకు చెందిన మాలోత్ భిక్షపతి మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవ పడేవాడు. కాగా, శుక్రవారం రాత్రి భార్య జ్యోతితో భిక్షపతి గొడవపడుతున్న సమయంలో తండ్రి హరిశ్చంద్రు అడ్డుకోగా కత్తితో దాడి చేయడంతో ఎడమ భుజంపై గాయమై ఆయన అరవడంతో పొరుగింట్లోని అంగోత్ మోతీరాం వెళ్లి వారించగా అతనిపై సైతం కత్తితో దాడి చేసి గాయపరిచాడు. హరిశ్చంద్రు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్ తెలిపారు.

నంబర్ ప్లేట్ లేని బైక్.. స్వాధీనం

జనగామ రూరల్ : నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు పట్టణంలోని పోచమ్మ ఆలయం వద్ద ఎస్సై సృజన్, పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా నంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్న వాహనాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తిరుపతి మీడియాకు వెల్లడించారు.

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



చిల్పూరు: పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ ఎన్నికల మండల ఇన్‌చార్జ్ గంకిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగంపల్లిలో శనివారం పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముందుగా ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చిరంజీవి, లింగమూర్తి గౌడ్, రజనీకర్, వెలిశాల శ్రీనివాస్, ప్రవీణ్, కుమారస్వామి పాల్గొన్నారు.

పల్లెల్లో కమలం మైకుల మోత షురూ

దేవరుప్పుల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ ప్రచార రథాలు జోరుగా తిరుగుతున్నాయి. శనివారం మండల కేంద్రంలోని జనగామ-సూర్యాపేట రహదారిలో సంత కొనసాగడంతో ఆ రథం జనం మధ్య చక్కర్లు కొట్టడంతో ఎన్నికల సందడి కనిపించింది. పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల కంటే ప్రచారంలో బీజేపీ ముందస్తుగా తిరగడం గమనార్హం.